సాక్షి
రాజన్న సిరిసిల్ల

బుధవారం । 19 । ఏప్రిల్ । 2023



అంజన్నకు మొక్కులు

కొండగట్టు : కొండగట్టు శ్రీఆంజనేయస్వామిని మంగళవారం వేలాది మంది భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



మరమగ్గాల పనిలో మగువలు

సిరిసిల్లలోని మరమగ్గాల పనిలో మగువలు కూడా పాలు పంచుకుంటున్నారు. వస్త్రోత్పత్తిలో భర్తలకు తోడుగా నిలుస్తున్నారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
40.0/26.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమవుతుంది. వర్షం కురిసే అవకాశం లేదు. రాత్రి వేళ చలిగాలులు వేగంగా వీస్తాయి.

అగ్ని కలపను భస్మీపటలం చేసినట్లు ఈర్ష్య సత్కారాలను స్వాహా చేస్తుంది.
– మహ్మద్ ప్రవక్త

ఇఫ్తార్	సహర్
బుధ 6.36	గురు 4.29

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

రైతుల సంక్షేమమే లక్ష్యం



చెక్కు అందిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రైతు మరణిస్తే ఆ కుటుంబానికి రైతు బీమాపథకం కింద రూ.5లక్షలు చెల్లిస్తున్న ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ అని, రైతుల సంక్షేమమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ ముందుకు సాగుతున్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ పరిధి గాజులపల్లెలో విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన మేడిశెట్టి మల్లయ్య కుటుంబానికి రూ.5లక్షల చెక్కును మంగళవారం అందజేశారు. బీజేపీ పాలితప్రాంతాల్లో ప్రధాని మోదీ రైతుబీమా, రైతుబంధు పథకాలను అమలు చేయడం లేదన్నారు. బీఆర్ఎస్ పార్టీ సభ్యుడైన మల్లయ్యకు పార్టీ తరఫున మరో రూ.2లక్షలు అందిస్తామని తెలిపారు. ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, సెస్ డైరెక్టర్ కృష్ణ హరి, సింగిల్‌విండో చైర్మన్ కృష్ణారెడ్డి, సర్పంచ్ కొల అంజమ్మ, ఎంపీటీసీ మామిండ్ల తిరుపతిబాబు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆసాముల సమ్మె



సమ్మెలో పాల్గొన్న ఆసాములు

సిరిసిల్లటౌన్: ఆసాములకు ఇచ్చిన హామీ ప్రకారం పింజర సబ్సిడీ అందించాలని చేస్తున్న నిరవధిక సమ్మె రెండో రోజు కొనసాగింది. ఆసాముల సమన్వయ కమిటీ అధ్యక్షుడు సిరిసిల్ల రవీందర్, కార్యదర్శి చేరాల అశోక్ మాట్లాడుతూ బతుకమ్మలకు చీరలకు సంబంధించి పింజర్లు, డాబీల ఏర్పాటుకు రూ.15వేల చొప్పున ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు రెండు నుంచి మూడు వేల రూపాయలు మాత్రమే చెల్లిస్తోందన్నారు. దీంతో ఆసాములు ఆర్థికంగా నష్టపోతారన్నారు. సమ్మెలో భాగంగా బుధవారం బైక్‌ర్యాలీ చేపట్టి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టడం జరుగుతుందని, ఆసాములు పెద్ద ఎత్తున్న హాజరుకావాలని పిలుపునిచ్చారు. మండల రాజు, పోరండ్ల శ్రీనివాస్, సుభాష్, నరేశ్, రాజేశ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతలో ముందుండాలి



ఎల్లారెడ్డిపేటలో మాట్లాడుతున్న సురేశ్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణతో ప్రతి ఒక్కరూ స్వచ్ఛతలో ముందుండాలని స్వచ్ఛ భారత్ జిల్లా కో–ఆర్డినేటర్ సురేశ్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం గ్రామీణ ఓడీఎఫ్‌ప్లస్‌పై మూడు రోజుల శిక్షణలో భాగంగా చేయాల్సిన అభివృద్ధి పనులపై సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వీవోఏలకు శిక్షణ ఇచ్చారు. సురేశ్ మాట్లాడుతూ మరుగుదొడ్ల సుస్థిరతను కాపాడడానికి అందరూ మరుగుదొడ్లు వాడాలన్నారు. క్లాత్, జూట్ బ్యాగుల వాడకాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, సెస్‌డైరెక్టర్ కృష్ణహరి, ఎంపీడీవో చిరంజీవి, ఎంపీవో వజీర్ పాల్గొన్నారు.

జిల్లాలో 3,491 మందికి కంటి వెలుగు పరీక్షలు

సిరిసిల్ల: జిల్లాలో మంగళవారం 3491 మందికి కంటి వెలుగులో పరీక్షలు నిర్వహించారు. 22 ప్రాంతాల్లో 56వ రోజు కంటి వెలుగు శిబిరాలు జరిగాయి. 553 మందికి రీడింగ్, 552 మందికి పాయింట్ అద్దాలు అందించారు. జిల్లాలో ఇప్పటి వరకు 2,06,342 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 33,979 మందికి రీడింగ్, 28,713 మందికి పాయింట్ అద్దాలు ఇచ్చారు. 198 మంది వైద్య సిబ్బంది కంటి వెలుగులో భాగస్వాములు అయ్యారు.

‘ఆసరా’ ఏదీ!

జిల్లాలో ఆసరా పింఛన్ల సమాచారం..

వృద్ధాప్య పింఛన్లు	35,785
దివ్యాంగుల పింఛన్లు	10,538
వితంతు పింఛన్లు	24,965
చేనేత పింఛన్లు	3803
గీత కార్మికుల పింఛన్లు	2440
బీడీ కార్మికుల పింఛన్లు	43,483
ఒంటరి మహిళల పింఛన్లు	1815
ఫైలేరియా, ఎయిడ్స్ బాధితుల పింఛన్లు	276
జిల్లాలో మొత్తం పింఛన్లు	1,23,105
నెలకు పింఛన్లుగా చెల్లింపులు	రూ.25,87,17,680



- కొత్త పెన్షన్.. అర్హుల టెన్షన్
- ఏడు నెలలుగా ఏడుపే
- ఆగస్టులో మంజూరు పత్రాలు పంపిణీ
- జిల్లాలో 8,015 మంది నిరీక్షణ



చేతిలో బాబుతో దీనంగా చూస్తున్న ఈమె పేరు ఆకారం రాజేశ్వరి. జిల్లాలోని ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్. దినసరి కూలిగా పనిచేస్తుంది. భర్త బాల ఎల్లం. వీరి పెద్ద కొడుకు భవిత్ మానసిక వికలాంగుడు. 2022 నవంబరులో భరత్ పేరుతో సదరం సర్టిఫికెట్ జారీ అయింది. బాబుకు ఆసరా పెన్షన్‌కు అర్హత ఉంది. దరఖాస్తు చేశారు. కానీ ఇప్పటి వరకు రాలేదు. పెన్షన్ కోసం ఆ పేదకుటుంబం నిరీక్షిస్తోంది.



ఈమె పేరు సుల్తాన్ శాంత(48). రుద్రంగికి చెందిన శాంత భర్త దుర్గయ్య మరణించాడు. 2022 ఆగస్టు నెలలో శాంతకు వితంతు పెన్షన్ ఆర్ జేఎస్‌సీడీ02800 మంజూరు చేశారు. ఏడు నెలలుగా పెన్షన్ డబ్బులు రావడం లేదు. ప్రతి నెలా ఆసరా పెన్షన్ వస్తుందనే ఆశతో బ్యాంకుకు వెళ్లి అడిగితే.. పైసలు రాలేదని సమాధానం వస్తుంది... ఇలా ఒక్కరు.. ఇద్దరు కాదు.. జిల్లా వ్యాప్తంగా ఇలా 8015 మంది అన్ని అర్హతలున్న పేదలు ఆసరా పెన్షన్ కోసం నిరీక్షిస్తున్నారు.

సిరిసిల్ల: ప్రభుత్వం పెన్షన్ వయసును 65 ఏళ్ల నుంచి 57కు తగ్గించడంతో జిల్లాలో పెన్షన్ల కోసం 2022లో 19,390 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకుని అర్హత సాధించారు. కానీ ఇందులో అర్హులను గుర్తించి 12,810 మందికి మాత్రమే వృద్ధాప్య పెన్షన్లు మంజూరు చేశారు. ఇంకా 6580 మందికి పెన్షన్ రాలేదు. అన్ని పెన్షన్లు రూ. 2016 చొప్పున నెలనెలా అందించాల్సి ఉండగా.. దివ్యాంగులకు రూ.3016 చొప్పున ఆసరా లభిస్తుంది. జిల్లాలో మరో 1435 మంది కొత్తగా అన్ని అర్హతలు ఉండి కూడా ఆసరా పెన్షన్ పొందలేక పోతున్నారు. జిల్లాలో వివిధ కారణాలతో 368 మంది పెన్షన్ పొందే వారు చనిపోయారు. వారి స్థానంలో వారి కుటుంబంలోని భర్త చనిపోతే.. భార్యకు.., భార్య చనిపోతే.. భర్తకు పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. కానీ చనిపోయిన పెన్షన్లను తొలగిస్తున్న అధికారులు కొత్తగా పెన్షన్ ఇవ్వలేకపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా 8015 మంది ఆసరా పెన్షన్ల కోసం నిరీక్షిస్తున్నారు.

పేదలకు ఆసరా.. ఓ భరోసా

ఆసరా పెన్షన్లు క్షేత్రస్థాయిలో ఆర్థిక స్వావలంభనకు బాటలు వేస్తున్నాయి. పెన్షన్లు పొందుతున్న వారిలో కొందరు అనర్హులు ఉండవచ్చు. కానీ ఆసరా పెన్షన్లు పొందుతున్న వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, ఎయిడ్స్, ఫైలేరియా బాధితులు, వితంతువులు, బీడీ కార్మికులు నిజంగానే నెలనెలా వచ్చే ఆసరా పెన్షన్ డబ్బులపై ఆధార పడి జీవిస్తున్నారు. ఆ డబ్బులు ఎప్పుడు వస్తాయా అని నిరీక్షిస్తున్నారు. ప్రభుత్వం అందించే ఆ సొమ్ములతో అనారోగ్యంతో ఉన్న వారు మందులకు, పేదలు నిత్యవసరాలకు ఇలా జీవన గమనంలో అన్ని అవసరాలను ఆసరా డబ్బులతో తీర్చుకుంటున్నారు.

ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేసి ఉంచాం



జిల్లాలో కొత్త పెన్షన్లకు సంబంధించి అన్ని వివరాలను ఆన్‌లైన్‌లో ఎంట్రీచేసి ఉంచాం. ప్రభుత్వం నుంచి అనుమతి రావాల్సి ఉంది. కొందరు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు కేవైసీ, ఆధార్ లింకు లేక సమస్యలు ఉన్నాయి. 57 ఏళ్ల వారి పెన్షన్ల విషయంలో అనర్హులున్నట్లు తేలింది. వివిధ కారణాలతో కొన్ని పెన్షన్లు పెండింగ్‌లో ఉన్నాయి. మా పరిధిలో ఉన్న సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తాం.

– బి.గౌతమ్‌రెడ్డి, డీఆర్‌డీవో.

సమస్యలు తెలుసుకునేందుకే వచ్చా..!

- కొప్పుల ఈశ్వర్‌కు తన ‘సంక్షేమ’మే ముఖ్యం
- కేసీఆర్ మెప్పు కోసమే పనిచేస్తున్నారు
- పీపుల్స్‌మార్చ్ పాదయాత్రలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క
- జిల్లాలో మాఫియాలదే రాజ్యం: శ్రీధర్‌బాబు



మాట్లాడుతున్న సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

సాక్షి, పెద్దపల్లి: ‘ఇప్పుడు ఎన్నికలు లేవు. అయినప్పటికీ కాంగ్రెస్ ఇచ్చిన తెలంగాణలో మీ సమస్యలు పరిష్కారమయ్యాయా..? లేదా..? తెలుసుకునేందుకు పాదయాత్రన మీ వద్దకు వచ్చా..’ అని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. ఆయన చేపట్టిన పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర మంగళవారం ధర్మారంలోని రచ్చపల్లి, రామయ్యపల్లి మీదుగా పెద్దపల్లి నియోజకవర్గం పాలితంలోకి ప్రవేశించింది. అయితే దొంగతుర్తి, బొంపల్లి, మేరపల్లి, తెనుగువాడ, పెద్దపల్లి, హనుమంతునిపేట, రాంపల్లి వరకు సుమారు 20 కిలోమీటర్ల మేర ఉద్రిక్తతల మధ్య కొనసాగింది.

కాంగ్రెస్ పార్టీ నిర్మించిన ప్రాజెక్టులతోనే..

ధర్మారం మండలం రామయ్యపల్లిలో భట్టి మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులతోనే రైతులకు ప్రస్తుతం సాగునీరందుతోందని, తెలంగాణ ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టుల ద్వారా చుక్క నీరందడం లేదని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని కేసీఆర్ రూ.5లక్షల కోట్ల అప్పుల్లోకి నెట్టారని విమర్శించారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పథకాలన్నీ దివంగత వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో కొనసాగాయన్నారు. 2004లోనే వైఎస్ ప్రభుత్వం ఉచిత విద్యుత్, పింఛన్లు, ధాన్యం కేంద్రాలు, ఉచిత విద్య, వైద్యం అందించారని గుర్తు చేశారు.

సొంత సంక్షేమం చూసుకుంటున్న ‘కొప్పుల’

జిల్లాకేంద్రంలోని రాజీవ్‌చౌక్ వద్ద ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో భట్టి మాట్లాడుతూ.. మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రజల సంక్షేమాన్ని విస్మరించి తన సంక్షేమమే చూసుకుంటున్నారని, ఆయన చేసిన అభివృద్ధి ఏమిటో చూపెట్టాలన్నారు. కేసీఆర్ మెప్పు కోసం పనిచేసే ఆయన అవసరమా..? ప్రజలే ఆలోచన చేయాలన్నారు. కవ్వాల్ టైగర్ ప్రాజెక్టు పేరుతో ఆదివాసీలను అడవి నుంచి తరిమివేశారు. మంచిర్యాల, రామగుండం ప్రజలు ఓపెన్‌కాస్టులతో, సింగరేణి ప్రైవేటీకరణతో ఇబ్బంది పడుతున్నారని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సమస్యలు పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.

ఇసుక, మట్టి, మర్డర్ల మాఫియా..

మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. జిల్లాలో ఇసుక, మట్టి, బూడిద దందాతోపాటు మర్డర్ల మాఫియా కొనసాగుతోందన్నారు. అధికారపార్టీ ఎమ్మెల్యేలు దందాలు చేసి దోచుకోవడానికే గెలిచినట్లు ఉందని ఎద్దేవా చేశారు. కాళేశ్వరంపై లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేసి చివరి ఆయకట్టుకు నీరు అందించాలని ఎన్నిసార్లు చెప్పినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజా గాయకుడు గద్దర్, డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్, మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు, జెడ్పీటీసీ గంటా రాములు, జగిత్యాల డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్, కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అలరించిన గద్దర్ పాట

‘మా మట్టికాళ్ల భట్టిగారు పాదయాత్ర చేస్తుండంట.. పోతవురో కేసీఆర్.. మా ఉసురు తగిలిపోతావురో..’ అంటూ గద్దర్ పాడిన పాటకు కార్యకర్తలు, ప్రజల నుంచి పెద్దఎత్తున స్పందన వచ్చింది.

కొట్టుకున్న కార్యకర్తలు..

జిల్లాలో కాంగ్రెస్ నాయకుల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. స్వయంగా సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ముందే కార్యకర్తలు కొట్టుకున్నారు. జిల్లాలో మూడు అసెంబ్లీ నియోజకవర్గాలుండగా.. శ్రీధర్‌బాబుకు సొంతగూడు మంథనిలో అసమ్మతి బెడద లేదు. మిగిలిన రెండుచోట్ల వర్గపోరు చాపకింద నీరులా కొనసాగుతోంది. కొందరు రేవంత్‌వర్గం.. మరికొందరు మరోవర్గంగా చీలిపోయి ఎవరికి వారే పార్టీ కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు.

మూడుసార్లు గలాట..

పెద్దపల్లి మండలం పాలితంలోకి భట్టి పాదయాత్ర ప్రవేశించగానే ముందుగా భారీ అనుచరవర్గంతో వచ్చిన మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు స్వాగతం పలికారు. తర్వాత తన అనుచరులతో వచ్చిన గంటా రాములు స్వాగతం పలికే క్రమంలో ఇరువర్గాలు నినాదాలతో హోరెత్తించారు. ఒకరినొకరు తోసుకోవడంతో అక్కడ తోపులాట జరిగింది. భట్టి సముదాయించటంతో సద్దుమణిగింది. సాయంత్రం బొంపల్లి వద్ద మరోసారి గొడవ జరిగింది. ఈ ఘటనలో గంట రాములు వర్గీయుడు నర్సింగ్ తలకు గాయాలయ్యాయి. రాత్రి పెద్దపల్లి జెండా చౌరస్తాలో నిర్వహించిన స్ట్రీట్‌కార్నర్ మీటింగ్ వద్ద మరోసారి ఇరు వర్గీయులు కొట్టుకున్నారు. భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు ఇరువర్గాలను సముదాయించి కార్యక్రమాన్ని కొనసాగించారు.

ముస్లింల సంక్షేమానికి సర్కారు పెద్దపీట

- మైనార్టీ కార్పొరేషన్ ద్వారా రుణాలు అందిస్తాం
- జెడ్పీచైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ
- నిరుపేద ముస్లింలకు రంజాన్ ‘తోఫా’ అందజేత



రంజాన్ కిట్లు అందిస్తున్న అరుణ, కళ

సిరిసిల్లటౌన్: ముస్లింల సంక్షేమానికి రాష్ట్ర సర్కారు పెద్దపీట వేస్తోందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అన్నారు. ప్రభుత్వం నిరుపేద ముస్లింలకు అందిస్తున్న ‘రంజాన్ తోఫా’ కిట్లను మంగళవారం సిరిసిల్ల గాజుల మల్లయ్య ఫంక్షన్ హాలులో పంపిణీ చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. పండుగలను ఘనంగా జరుపుకోవాలన్న లక్ష్యంతో సీఎం కేసీఆర్ బతుకమ్మ, క్రిస్మస్, రంజాన్‌కు కొత్తదుస్తులు అందిస్తున్నారని తెలిపారు. పేదింటి ఆడపిల్లల వివాహాలకు తల్లిదండ్రులకు ఆర్థికభారం పడకుండా షాదీముబారక్, కల్యాణలక్ష్మి వంటి పథకాలు అందిస్తున్నారని వివరించారు. మైనార్టీల అభ్యున్నతికోసం కార్పొరేషన్ ద్వారా యువతకు ఉపాధి రుణాలు ఇస్తున్నారని తెలిపారు. సర్వమత సామరస్యాన్ని బీఆర్ఎస్ సర్కారు కోరుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, ఆర్ఎస్ఎస్ కన్వీనర్ గడ్డం నర్సయ్య, స్థానిక కౌన్సిలర్ గడ్డం చందన, జిల్లా మైనార్టీ అధికారి సర్వర్‌మియా, తహసీల్దార్ విజయ్, మజీద్ కమిటీ అధ్యక్షుడు ఎండీ సలీం, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

ఆరోగ్య పరీక్షలు జాగ్రత్తగా చేయాలి



పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్

సిరిసిల్ల: జిల్లాలో ఆరోగ్య మహిళా శిబిరాల్లో అన్ని రకాల ఆరోగ్య పరీక్షలు జాగ్రత్తగా చేయాలని డీఎంహెచ్‌వో సుమన్‌మోహన్‌రావు అన్నారు. సుందరయ్యనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆరోగ్య మహిళా శిబిరాన్ని సందర్శించారు. జిల్లాలోని నేరెళ్ల, తంగళ్లపల్లి, వేములవాడ, సుందరయ్య నగర్ ఆరోగ్య కేంద్రాల్లో 412 మందికి వైద్యపరీక్షలు చేసినట్లు ఆయన వివరించారు. 189 మందికి ల్యాబ్ పరీక్షలు, 22 మందికి యూటీఐ మూత్ర సంబంధ పరీక్షలు, 90 మందికి థైరాయిడ్, 43 మంది విటమిన్ డీ పరీక్షలు, 147 మందికి సీబీపీ పరీక్షలు చేసినట్లు సుమన్‌మోహన్‌రావు తెలిపారు. 83 మందికి సూక్ష్మ పోషకాల లోపాల పరీక్షలు చేసి 29 మందికి జిల్లా ఆస్పత్రికి సిఫార్సు చేసినట్లు జిల్లా వైద్యాధికారి వెల్లడించారు.

వడ్లు నాణ్యతతో కొనుగోలు చేయాలి



కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న డీఆర్‌డీవో గౌతంరెడ్డి

- కేంద్రాల్లో వసతులు కల్పించాలి
- డీఆర్‌డీవో బి.గౌతంరెడ్డి

సిరిసిల్ల: జిల్లాలో యాసంగి సీజన్ వడ్లను నాణ్యతతో కొనుగోలు చేయాలని డీఆర్‌డీవో బి.గౌతంరెడ్డి కోరారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఏపీఎంలు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, బుక్‌కీపర్లకు శిక్షణ ఇచ్చారు. డీఆర్‌డీవో మాట్లాడుతూ జిల్లాలో 46 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, అన్ని కేంద్రాల్లోనూ మంచి నీటి వసతి, నీడ, కరెంట్ సౌకర్యాలను కల్పించాలన్నారు. వడ్ల కొనుగోళ్లలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ.. రైతులకు ఇబ్బందులు లేకుండా.. ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డీఆర్‌డీఏ సిబ్బంది అందరూ సమన్వయంతో పని చేసి ధాన్యం కొనుగోళ్లు వేగంగా పూర్తి అయ్యేలా చూడాలని గౌతంరెడ్డి కోరారు. డీఎస్‌వో ఎస్.జితేందర్ రెడ్డి, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ జితేంద్రప్రసాద్, అదనపు డీఆర్‌డీవో రవికుమార్, ఏపీఎంలు పాపారావు, శ్రీనివాస్, జిల్లా సమాఖ్య ప్రతినిధులు సరిత, రజిత, సెర్ప్ సిబ్బంది పాల్గొన్నారు.

పోయిన సెల్‌ఫోన్ దొరుకుతుంది!

- ఆ సెల్‌ఫోన్ పనిచేయదు, కొత్త సిమ్ వేస్తే తెలిసిపోతుంది..
- సీఈఐఆర్ సాంకేతికతపై రాష్ట్ర వ్యాప్తంగా పోలీసులకు శిక్షణ
- కరీంనగర్‌లో తొలిసారిగా ప్రయోగాత్మకంగా పరిశీలన
- ఇప్పటికే పలు ఫోన్లను పట్టుకున్న రూరల్ పోలీసులు
- మీరు కొన్నది దొంగ ఫోనా? కాదా? తెలిసిపోతుంది
- త్వరలో సామాన్యులకు సైతం విస్తృత అవగాహన



పెద్దపల్లి జిల్లాకు చెందిన బొడ్ల రమేశ్‌కు సెల్‌ఫోన్ అందిస్తున్న కరీంనగర్ సీపీ సుబ్బారాయుడు

సాక్షిప్రతినిధి, కరీంనగర్: కొంతకాలంగా సెల్‌ఫోన్ల చోరీలు పెరిగిపోతున్నాయి. ఫోన్ పోగొట్టుకున్న వారంతా పోయిన ఫోన్ కంటే కూడా అందులో ఉండే డేటా కోసం ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా ఈ రోజుల్లో విద్య, వ్యాపారం, ఉద్యోగం, ఆరోగ్యం, బ్యాంకింగ్, రాజకీయ సమావేశాలు ఇలా ప్రతీ సమాచారాన్ని సెల్‌ఫోన్ నుంచే నిర్వహిస్తున్నారు. కరోనా తరువాత డేటా వినియోగం పెరిగింది. విద్యార్థుల నుంచి ముసలివారి దాకా స్మార్ట్‌ఫోన్ల వినియోగం ముమ్మరంగా మారింది. ఈ క్రమంలో తమ వ్యక్తిగత, వృత్తిగత సమాచారాన్ని పలు సాఫ్ట్ కాపీల రూపంలో ఫోన్‌లోనే భద్రపరుచుకుంటున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే మన దైనందిక జీవితంలో ఫోన్ కీలకంగా మారింది. అంతటి కీలకమైన ఫోన్‌ను పొగొట్టుకున్నా.. లేక చోరీకి గురైనా ఏంటి పరిస్థితి? అమ్మో..! అస్సలు ఆ పరిస్థితినే ఊహించుకోలేని స్థితికి చేరుకున్నాం. అంతటి కీలకమైన స్మార్ట్‌ఫోన్ పోయినా.. పొగొట్టుకున్నా.. అందులో డేటా తస్కరణకు గురైతే పలు సున్నితమైన విషయాలు బయటికి వచ్చే ప్రమాదం కూడా ఉంది. అందుకే.. ఇకపై అలాంటి చిక్కులు లేకుండా తెలంగాణ పోలీసులు వినూత్న సాంకేతికతను అందుబాటులోకి తీసుకువస్తున్నారు. ఇందులో భాగంగా కరీంనగర్ కమిషనరేట్‌లో ఈ విధానం ప్రయోగాత్మకంగా అందుబాటులోకి వచ్చింది. ఇప్పటికే పోగొట్టుకున్న రెండు మొబైల్స్‌ను పట్టుకున్న పోలీసులు తిరిగి వాటిని యజమానులకు అప్పగించారు.

సీఈఐఆర్ సాంకేతికత ద్వారా..!

డిపార్ట్‌మెంటు ఆఫ్ టెలీ కమ్యూనికేషన్స్ ఆధ్వర్యంలో సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిష్టర్ (సీఈఐఆర్) సాంకేతికతను వినియోగించుకోవడం ద్వారా పోయిన సెల్‌ఫోన్‌ను తిరిగి కనిపెట్టే సాంకేతికతను పరిచయం చేస్తున్నారు. ఈ సాంకేతికతను ఉపయోగించి సీఈఐఆర్ వెబ్‌సైట్ ఓపెన్ చేసి బ్లాక్ చేయవచ్చు. సీఈఐఆర్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి సెల్‌ఫోన్‌ను ఐఎంఈఐ నెంబరు సాయంతో బ్లాక్ చేయవచ్చు. ఈ తరువాత ఆ సెల్‌ఫోన్ ఎట్టి పరిస్థితుల్లోనూ పనిచేయదు. ఒకవేళ ఫోన్ ఆన్‌చేసి, అందులో కొత్త సిమ్‌కార్డు వేసినా.. ఆ విషయం ఫోన్ యజమానికి ఎస్ఎంఎస్ ద్వారా తెలిసిపోతుంది.

ఎలా పనిచేస్తుంది?

- సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వెంటనే.. https://www.ceir.gov.in పోర్టల్ ఓపెన్ చేయాలి. అందులో బ్లాక్ ఫోన్ అనే ఆప్షన్‌ను ఎంచుకోవాలి.
- అందులో మొబైల్ నెంబర్–1, మొబైల్ నెంబరు –2, సెల్‌ఫోన్ బ్రాండ్, మోడల్, ఇన్వాయిస్ (బిల్) ఫొటో సూచించిన గడుల్లో నింపాలి.
- పోగొట్టుకున్న స్థలం, పోయిన తేదీ, ఇతర చిరునామాలు, అంతకుముందే ఇచ్చిన పోలీస్ కంప్లయింట్ నెంబరు, ఫోన్ యజమాని చిరునామా, ఈమెయిల్ ఐడీ, ధ్రువీకరణ కార్డులు, చప్టాలను సూచించిన బాక్సుల్లో నింపాలి.
- వెంటనే మీ సెల్‌ఫోన్ (పాత నెంబరు మీద తీసుకున్న కొత్త సిమ్) నెంబరుకు ఓటీపీ వస్తుంది.
- ఓటీపీ ఎంటర్ చేసిన తరువాత ఫామ్‌ను సబ్మిట్ చేయాలి. ఆ తరువాత ఫోన్ దానంతట అదే బ్లాక్ అవుతుంది. ఇకపై దాన్ని ఎవరూ ఆపరేట్ చేయలేరు. దానిలోని డేటా సురక్షితంగా ఉంటుంది. ఒకవేళ దొంగించించిన వ్యక్తి లేదా సెకండ్ హ్యాండ్‌లో కొన్న వ్యక్తి సిమ్ వేయగానే.. మీ నెంబరుకు మెసేజ్ వస్తుంది.
- ఆ సందేశం ఆధారంగా ఫోన్ ఎక్కడ ఉన్నా.. పట్టుకోవడం సులభతరంగా మారుతుంది.

అన్‌బ్లాక్ చేయండిలా..!

- మీ ఫోన్‌ను పోలీసులు పట్టుకున్నా.. లేక మీకే దొరికినా.. మీ పాత ఐడీని, ఫోన్‌నెంబరు, ఇతర వివరాలు నింపిన తరువాత ఫోన్‌ను అన్‌బ్లాక్ చేసుకోవచ్చు.

ఐఎంఈఐ నెంబరు తెలియకపోతే?

ఒకవేళ మీరు మీ ఫోన్‌ను పొగొట్టుకున్నారు. ఐఎంఈఐ నెంబరు తెలియకపోయినా/గుర్తులేకపోయినా దాన్ని ఇలా తెలుసుకోవచ్చు. మీ మొబైల్ నుంచి (#06#) డయల్ చేయగానే మీ మొబైల్ నెంబరుపై దాని ఐఎంఈఐ నెంబరు ప్రత్యక్షమవుతుంది.

- ఒకవేళ ఫోన్ పోగొట్టుకుంటే.. ఫోన్ కొన్న బాక్స్ మీద లేదా కొనుగోలు చేసిన షాప్‌లో ఉన్న ఇన్వాయిస్ (బిల్) ద్వారా ఐఎంఈఐ నెంబరు సాధించవచ్చు.

బ్లాక్ చేయండిలా..

మీరు సెకండ్ హ్యాండ్ లేదా ఓఎల్ఎక్స్ తదితర వెబ్‌సైట్స్ లేదా తెలిసిన వారి దగ్గర ఫోన్ కొనుక్కోవాల్సి వచ్చినపుడు అది దొంగిలించిందా లేదా బ్లాక్‌లిస్టులో ఉందా? అన్న విషయం మనం కేవైఎం (నో యువర్ మొబైల్) విధానంలో ముందే తెలుసుకోవచ్చు.

- ఇందుకోసం మొబైల్ తీసుకుని కేవైఎం (నో యువర్ మొబైల్) విధానంలోనూ ఐఎంఈఐ నెంబరును తెలుసుకోవచ్చు. ఇందుకోసం కేవైఎం అని పెద్ద అక్షరాల్లో టైప్ చేయాలి. అనంతరం 15 అక్షరాల ఐఎంఈఐ నెంబరును టైప్ చేసి 14422కు ఎస్ఎంఎస్ పంపాలి.
- ఇందుకోసం కేవైఎం యాప్‌ను సైతం డౌన్‌లోడు చేసుకోవచ్చు. ఇది ఆండ్రాయిడ్/ఐఓఎస్ మొబైళ్ల ప్లేస్టోర్లలో అందుబాటులో ఉంది. లేదా సీఐఆర్ వెబ్‌పోర్టల్‌లో ఆఖరుగా ఇచ్చిన ఆప్షన్ ద్వారా కూడా సెల్‌ఫోన్ తనిఖీ చేసుకోవచ్చు.

ఇక తస్కరులకు చుక్కలే

తాజా సాంకేతికత కరీంనగర్‌లో ప్రయోగాత్మకంగా ఉపయోగిస్తున్నాం. ఇప్పటికే కమిషనరేట్ పరిధిలోని అన్ని స్టేషన్ల రైటర్లకు దీని వినియోగంపై శిక్షణ ఇచ్చాం. రూరల్ పోలీసులు ఈ సాంకేతికత ద్వారా పలు ఫోన్ల జాడ తెలుసుకుని పట్టుకోగలిగారు. త్వరలో దీనిపై సెల్‌ఫోన్ వినియోగదారులకు సైతం విస్తృత అవగాహన కల్పిస్తాం. ఇక ఫోన్ కొట్టేసినా అది పనిచేయదు కాబట్టి, చోరుల ఆటలు సాగవు.

– ఎల్.సుబ్బారాయుడు, సీపీ, కరీంనగర్

క్లుప్తంగా

తండ్రి భూమిని తన పేరిట రాయాలని..

● వాటర్ ట్యాంక్ ఎక్కి తనయుడి నిరసన


ట్యాంక్‌పై రమేశ్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తన తండ్రి సంపాదించిన భూమిని తన పేరిట రాయాలంటూ ఓ యువకుడు వాటర్ ఎక్కి, నిరసన తెలిపాడు. ఈ ఘటన తంగళ్లపల్లి మండలంలోని జిల్లెల్ల గ్రామంలో చోటుచేసుకుంది. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లెల్లకు చెందిన బాలసాని ఎల్లయ్య–జపమాల దంపతులకు ఒక కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కాగా ఎల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయన పేరిట ఉన్న 3 ఎకరాల భూమిని భార్య తన పేరిట మార్చుకుంది. అయితే కుమారుడు రమేశ్ భూమిని తన పేరిట రాసివ్వాలని మంగళవారం స్థానిక ప్రభుత్వ పాఠశాల దగ్గరున్న వాటర్ ట్యాంక్ ఎక్కాడు. ఫోన్‌లో సెల్ఫీ ఫొటో తీసి, గ్రామ వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేశాడు. ఇది చూసిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకున్నారు. బాధితుడితో మాట్లాడి, కిందకు రప్పించారు. అనంతరం అతన్ని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ.. తన తండ్రి ఎల్లయ్య పేరిట ఉన్న భూమిని తల్లి తన అక్కాచెల్లెలికి ఇచ్చేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించాడు. రూ.20 లక్షలు, రైతుబీమా ద్వారా వచ్చిన రూ.5 లక్షలు తల్లి వద్దనే ఉన్నాయని, ఆ డబ్బులను తాను అడగడం లేదని తెలిపాడు. గతంలో తనకు విషాహారం పెట్టి, చంపే ప్రయత్నం చేశారని, అక్క రేణుక, చెల్లి కళావతి, బావ శ్రీనివాస్‌లు తనపై దాడికి ప్రయత్నించారని, తన భార్యపై దాడి చేశారని అన్నాడు. 100కు కాల్ చేయగా పోలీసులు వచ్చి, కాపాడారని పేర్కొన్నాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


నాగరాజు మృతదేహం

సిరిసిల్లటౌన్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణంలోని గణేశ్ నగర్‌కు చెందిన విశ్వనాథుల నాగరాజు(42) వడ్రంగి కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. నాలుగు రోజుల క్రితం ఎల్లారెడ్డిపేట మండలంలోని వెంకటాపూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో అతని ఎడమ కాలు విరిగింది. బాధిత కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అతని కాలికి ఆపరేషన్ చేసేందుకు మంగళవారం మత్తు ఇంజక్షన్ ఇవ్వగా ఫిట్స్, గుండెపోటు రావడంతో చనిపోయాడని వైద్యులు తెలిపారు.

భూమి విషయంలో గొడవ.. ఇద్దరిపై కేసు

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని సేవాలాల్ తండాలో గొడవ పడిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ధరంసోత్ బాల్‌రెడ్డి నాయక్, రవి నాయక్‌లు భూమి విషయంలో మంగళవారం గొడవ పడ్డారు. వీరిలో బాల్‌రెడ్డి నాయక్ ఆత్మహత్యాయత్నం చేశాడు. బాధితులు పరస్పరం ఫిర్యాదు చేసుకోవడంతో ఇద్దరిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఒకరి బలవన్మరణం

గన్నేరువరం(మానకొండూర్): మండల కేంద్రానికి చెందిన పర్శరాములు(50) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సురేందర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. పర్శరాములు గతంలో గల్ఫ్ వెళ్లివచ్చాడు. కొన్ని రోజులుగా మతిస్థిమితం సరిగా ఉండటం లేదు. ఈ క్రమంలో మంగళవారం ఇంటివద్ద బాత్‌రూంలో ఉరేసుకున్నాడు. మృతుడి భార్య భూలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు.

మరమగ్గాల పనిలో మగువలు

● వస్త్రోత్పత్తిలో భర్తకు తోడుగా.. ● పవర్‌లూమ్స్ నడుపుతూ ఆర్థికంగా నిలదొక్కుకుంటున్న వైనం


పవర్‌లూమ్స్ నడిపిస్తున్న దంపతులు

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల చేనేత పరిశ్రమకు పుట్టినిల్లు. ఈ కార్మిక క్షేత్రంలో అనేక మంది నేత కార్మికులు వస్త్రోత్పత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. వస్త్రోత్పత్తిలో కీలకం సాంచాలు(పవర్‌లూమ్స్) నడపడం. ఇది చాలా కష్టమైన పని. తీరిక లేకుండా ఉదయం నుండి రాత్రి వరకు నిలబడి పనిచేస్తూ ఉండాలి. అందుకే వాటిని మగవారు మాత్రమే నడుపుతుంటారు. కానీ గత కొన్నేళ్లుగా సిరిసిల్ల పట్టణంలోని ఎంతో మంది మహిళలు వస్త్రోత్పత్తి రంగంలో రాణిస్తున్నారు. మగవారికి దీటుగా మరమగ్గాలు నడుపుతున్నారు. ఒకవైపు ఇంటి బాధ్యత నిర్వహిస్తూ మరోవైపు భర్తకు తోడుగా పవర్‌లూమ్స్ పనిలో నిమగ్నమవుతున్నారు. దంపతులు కలిసికట్టుగా పనిచేస్తూ ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు.

రాత్రి వరకు పని చేస్తాం..



మాది రాజీవ్‌నగర్. మా నాన్న పవర్‌లూమ్ కార్మికుడు. పెళ్లికి ముందు మా అమ్మగారింట్లో అప్పుడప్పుడు సాంచాలు నడిపేదాన్ని. పెళ్లయిన తర్వాత కొన్ని రోజులు బీడీలు చేశాను. నా భర్త మహేశ్ వేరేచోట కార్మికుడిగా పనిచేసేవారు. అనంతరం మూడు జోడీలను కిరాయికి తీసుకొని, మా ఇంట్లోనే ఏర్పాటు చేసుకున్నాం. ఇద్దరం కలిసి ఎనిమిదేళ్లుగా పవర్‌లూమ్స్ నడుపుతున్నాం. ఉదయం నుంచి రాత్రి వరకు పని చేస్తాం. మామూలు రోజుల్లో కంటే బతుకమ్మ చీరల ఆర్డర్ సమయంలో కాస్త ఎక్కువగా సంపాదిస్తున్నాం. వస్త్రోత్పత్తి ఆర్డర్లు ఇంకా పెరగాలి.

– వనం సంధ్య, రాజీవ్‌నగర్

ఆరేళ్లుగా నడుపుతున్న..

నేను ఆరేళ్లుగా సాంచాలు నడుపుతున్నా. నా భర్తకు తోడుగా పనిలో ఆసరాగా ఉంటున్నాను. మా ఖార్కానాలో మేమే కార్మికులుగా పనిచేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నాం. నా భర్త పని నిమిత్తం వేరే ఊరు వెళ్తే పవర్ లూమ్స్ నడిపే బాధ్యత నాదే. ప్రస్తుతం గవర్నమెంట్ ఆర్డర్లు ఎక్కువగా ఉండటంతో ఉపాధి దొరుకుతోంది. ఇటీవలే మరో మరమగ్గాన్ని కొనుగోలు చేశాం. వస్త్రోత్పత్తి రంగంలో రాణిస్తున్నందుకు గాను హైదరాబాద్‌లో చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో సన్మానించారు.

– చేరాల రూప–రవీందర్, రాజీవ్‌నగర్



రూ.25 వేలు సంపాదిస్తున్నం



ఓవైపు ఇంటి పని చేస్తూనే మరోవైపు నా భర్తకు పనిలో తోడుగా ఉంటున్నాను. ఆర్థికంగా స్థిరపడేందుకు ఆరు సాంచాలను కిరాయికి తీసుకొని, ఏడేళ్లుగా నడిపిస్తున్నాం. ఖాళీ సమయంలో బీడీలు కూడా చేస్తా. ప్రభుత్వం నుంచి వస్త్రోత్పత్తి ఆర్డర్లు రావడంతో పని ఎక్కువగా దొరుకుతోంది. దీంతో ఇద్దరం కలసి సాంచాలు నడుపుతున్నాం. కష్టపడి పని చేస్తూ నెలకు దాదాపు రూ.25 వేల వరకు సంపాదిస్తున్నాం. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకుంటే సొంతంగా మరమగ్గాలు కొనుగోలు చేసి, ఆర్థికంగా అభివృద్ధి చెందుతాం.

– గూడూరి అనిత–రాజు, సిరిసిల్ల

నగల కోసం మహిళ దారుణ హత్య

● మద్యం తాగించి, ఘాతుకానికి పాల్పడిన ఇద్దరు మేస్త్రీలు
● మృతదేహాన్ని కొత్తపల్లి అక్కపెల్లి చెరువులో పడేసిన వైనం
● మృతురాలు కామారెడ్డి జిల్లా అన్నారం వాసి


ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు, గ్రామస్తులు


నర్సవ్వ (ఫైల్)

రామారెడ్డి(ఎల్లారెడ్డి)/(గంభీరావుపేట(సిరిసిల్ల): తమతో కలిసి పనిచేసే మహిళ నగలపై కన్నేసిన మేస్త్రీలు ఆమెను హతమార్చి, వాటిని కాజేశారు.. అనంతరం మృతదేహాన్ని రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలోని కొత్తపల్లి గ్రామ అక్కపల్లి చెరువులో పడేసిన ఘటన మంగళవారం వెలుగుచూసింది. అన్నారం గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. అన్నారం గ్రామానికి చెందిన బెరికె నర్సవ్వ (38) కామారెడ్డిలోని అడ్డమీదికి ప్రతీరోజు కూలి పనికి వెళ్తుంది. రోజూ మాదిరిగానే గత శనివారం వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురై, కామారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. కూలి పనికి ఎక్కడికి వెళ్తుందో తెలుసుకొని, రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం రాజుపేట గ్రా మానికి చెందిన ప్రకాశ్, ఎల్లయ్య, సుకన్యలను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో హత్య ఘటన వెలుగుచూసిందని కామారెడ్డి సీఐ నరేశ్ తెలిపారు. నర్సవ్వ మీదున్న 4 తులాల బంగారు ఆభరణాల కోసమే ఆమెను చంపేసినట్లు తెలుస్తోందన్నారు. నర్సవ్వకు రామారెడ్డిలో మద్యం తాగించి, అనంత రం గొంతు నులిమి హత్య చేసి, మృతదేహాన్ని డ్రమ్ములో పెట్టి, అక్కపల్లి చెరువులో పడేశారన్నారు. మృతురాలి భర్త సాదీలో ఉన్నాడని తెలిపారు. ఆమెకు కుమార్తె, కుమారుడు ఉన్నారని పేర్కొన్నారు.

లింగన్నపేటలో బంధువుల ఆందోళన

పోలీసులు తమకు న్యాయం చేయడం లేదని, మృతురాలి కుటుంబసభ్యులు, బంధువులు, అన్నారం గ్రామస్తులు రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం లింగన్నపేట ప్రధాన చౌరస్తాలో మంగళవారం ఆందోళన చేపట్టారు. అమాయకురాలైన నర్సవ్వను పనికి తీసుకెళ్లి, బంగారం దోచుకోవడంతోపాటు దారుణంగా హత్య చేసి, చెరువులో పడేశారన్నారు. నేరస్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ప్లాట్ పేరిట మోసపోయిన మహిళ

● న్యాయం చేయాలని వేడుకోలు
● కలెక్టర్‌ను కలవడానికి వచ్చిన బాధితురాలు


కలెక్టరేట్ వద్ద మాట్లాడుతున్న మంజుల

సిరిసిల్లఅర్బన్: మిడ్‌మానేరు పునరావాసం కింద తనకు మంజూరైన ప్లాట్‌ను మోసపూరితంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని వేములవాడ మండలం రుద్రవరానికి చెందిన పచ్చిమట్ల మంజుల కోరింది. మంగళవారం ఆమె కలెక్టరేట్‌కు వచ్చింది. బాధితురాలి వివరాల మేరకు.. రుద్రవరం మధ్య మానేరులో ముంపునకు గురికాగా.. పునరావాసం కింద మంజుల ప్లాట్‌కు దరఖాస్తు చేసుకుంది. అదే గ్రామానికి చెందిన స్వామి నీకు పట్టా రాదు.. నేను పైరవీ చేసి పట్టా ఇప్పిస్తానని రూ.40 వేలు తీసుకున్నాడు. ఈ క్రమంలో మంజులకు శాభాశ్‌పల్లి ఆర్అండ్ఆర్ కాలనీలో సర్వేనంబర్ 451లో 339 ప్లాట్ నంబర్‌తో పట్టా వచ్చింది. కానీ స్వామి మంజులకు రుద్రవరం శ్మశాన వాటికలో ప్లాట్ వచ్చిందని అబద్ధాలు చెప్పి మోసం చేశాడు. తాను పైరవీ చేయడం వల్ల ప్లాట్ వచ్చిందని రూ.16 లక్షలు ఇచ్చి, తీసుకుంటానని బెదిరించాడు. మంజుల బ్యాంక్ అకౌంట్ నంబర్ తీసుకొని, రూ.లక్ష ఖాతాకు పంపి రూ.2 లక్షలు ఎఫ్‌డీ చేశాడు. మిగతా డబ్బుల తర్వాత ఇస్తానని మోసం చేసి, రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. తనను మోసం చేసిన స్వామిపై చర్యలు తీసుకొని, న్యాయం చేయాలని కలెక్టర్‌ని కలవడానికి వచ్చినట్లు బాధితురాలు తెలిపింది.

వేగంగా వచ్చి స్కూటీని ఢీకొన్న లారీ

● ఒకరికి తీవ్ర గాయాలు ● పరిస్థితి విషమం



నుజ్జునుజ్జయిన రామస్వామి కాలు, స్కూటీ

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని సిరిసిల్ల–కామారెడ్డి ప్రధాన రహదారిపై ఓ స్కూటీని లారీ ఢీకొన్న ఘటనలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్సై శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిపేట మండలంలోని నారాయణపూర్‌కు చెందిన తాళ్లపెల్లి రామస్వామి మంగళవారం స్కూటీపై మండల కేంద్రం నుంచి ఇంటికి వెళ్తున్నాడు. అదే సమయంలో ఎదురుగా వేగంగా వస్తున్న వడ్ల లోడ్ లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రామస్వామి లారీ కిందికి వెళ్లడంతో ఆయన కాలు నుజ్జునుజ్జయింది. స్కూటీ లారీ టైరు కింద ఇరుక్కొని, నుజ్జునుజ్జయింది. రామస్వామి పరిస్థితి విషమంగా ఉంది. స్థానికులు అతన్ని 108 వాహనంలో సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

తిమ్మాపూర్(మానకొండూర్): మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఎల్ఎండీ ఎస్సై ప్రమోద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గోదావరిఖనికి చెందిన అనంతుల శ్రీకాంత్ తన కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లో ఉండేందుకు రూం తీసుకున్నాడు. సామగ్రి తీసుకెళ్లేందుకు మంచిర్యాలకు చెందిన శ్యాంసుందర్ టాటాఏస్ వాహనాన్ని మాట్లాడుకున్నాడు. సోమవారం సాయంత్రం ఇద్దరూ సామగ్రి తీసుకెళ్లారు. తిరిగి మంగళవారం ఉదయం గోదావరిఖని బయల్దేరారు. 6 గంటలకు తిమ్మాపూర్ ఎంపీడీవో కార్యాలయం వద్దకు రాగానే వాహనం అదుపుతప్పి, కల్వర్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. అక్కడే ఉన్న ఆర్టీసీ పోలీసులు స్పందించి, క్షతగాత్రులను బయటకు తీశారు. ఎస్సై ప్రమోద్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని, బాధితుల వివరాలు తెలుసుకున్నారు. 108 వాహనంలో శ్రీకాంత్‌ను, హెచ్‌కేఆర్ అంబులెన్స్‌లో శ్యాంసుందర్‌ను కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. డ్రైవర్ శ్యాంసుందర్ కాలు నుజ్జునుజ్జవగా, శ్రీకాంత్ ఎడమ భుజం విరిగింది.

'జనశక్తి' సాగర్ ఉద్యమ ద్రోహి

● కామారెడ్డి కేసులో మా ప్రమేయం లేదు
● నేను జైలులో ఉండగా.. పరారీలో ఉన్నట్లు చూపారు
● జనశక్తి అగ్రనేత కూర రాజన్న


సిరిసిల్లలో మీడియాతో మాట్లాడుతున్న జనశక్తి అగ్రనేత కూర రాజన్న

సిరిసిల్ల: సీపీఐ(ఎంఎల్) జనశక్తి మాజీ రాష్ట్ర కార్యదర్శి సాగర్ అలియాస్ సత్యం, ఎడ్ల లక్ష్మీరాజం ఉద్యమ ద్రోహి అని ఆ పార్టీ అగ్రనేత కూర రాజన్న అలియాస్ రాజేందర్ అన్నారు. సిరిసిల్ల కోర్టు ఆవరణలో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ కామారెడ్డిలో ఇంకో కేసు తనపై నమోదైందని, అందుకు సాగర్ కారకుడని ఆరోపించారు. 18 ఏళ్ల కిందట పార్టీలో పని చేసిన సాగర్ జనశక్తి పార్టీకి రాజకీయంగా, ఆర్థికంగా నష్టం చేశాడని అన్నారు. కామారెడ్డి బీడీ కంపెనీ యజమాని శ్రీశైలంతో సాగర్‌కు ఆర్థిక సంబంధాలు ఉన్నాయని, ఆయన ఆ కంపెనీలో భాగస్వామి అయి ఉంటాడని పేర్కొన్నారు. ఈ కేసులో కామారెడ్డి పోలీసులు పొరపాటు చేశారని, తాను చంచల్‌గూడా జైలులో ఉండగా.. పరారీలో ఉన్నట్లు ఎఫ్ఐఆర్‌లో చూపాలరని తప్పుపట్టారు. ఇది ఒక్కటి చాలదా..! ఇది ఫేక్ కేసని కొట్టేయడానికి అని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా ఆ కేసును కొట్టి వేయాలన్నారు. ఆ కేసులో అరెస్ట్ అయిన మరో వ్యక్తి జక్కుల యాదగిరి తనకు తెలియదని, సిరిసిల్లలో అమరుడైన జక్కుల ఎల్లన్న మాత్రం తనకు తెలుసని వివరించారు. తనపై పోలీసులు సుద్దాల ప్రభాకర్‌రావు హత్య కేసు లాంటి అనేక తప్పుడు కేసులు పెట్టారని ఆయన అన్నారు. ఆయన వెంట రాజన్న సోదరుడు కూర దేవేందర్ అలియాస్ అమర్, విమలక్క, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు, మాజీ జనశక్తి నాయకులు బడే స్వామిదాస్, గొట్టె రుక్మిణి, రాజేశ్వరి, మల్లేశం, రాజు తదితరులు ఉన్నారు.

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

● వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము


మాట్లాడుతున్న రాము

వేములవాడఅర్బన్: మిడ్ మానేరు ముంపు గ్రామాల్లో పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం వేములవాడలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మిడ్ మానేరు ముంపు గ్రామాల నిర్వాసితుల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటికీ ఆ దిశగా చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఈ నెల 30వ తేదీలోగా పరిష్కరించకుంటే ఐక్యవేదిక ఆధ్వర్యంలో మే 3న నిర్వహించే పోరాటానికి తాము మద్దతు తెలుపుతామన్నారు. నిర్వాసితులకు ఇవ్వాల్సిన భూములు, ఇళ్లకు సంబంధించిన పరిహారం త్వరగా ఇవ్వాలన్నారు. అలాగే బాధితుల ఉపాధి కోసం ఈ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని చెప్పిన సర్కారు ఇప్పటివరకు స్పందించలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చందుర్తి–మోత్కురావుపేట రోడ్డు పూర్తి చేయండి

● ఎమ్మెల్యే రమేశ్‌బాబు వైఫల్యం వల్లే పనులు నిలిచిపోయాయి
● డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్
● చందుర్తి వరకు బైక్ ర్యాలీ


బైక్ ర్యాలీ తీస్తున్న శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు

చందుర్తి(వేములవాడ): ఎమ్మెల్యే రమేశ్‌బాబు వైఫల్యం వల్లే చందుర్తి–మోత్కురావుపేట రోడ్డు పనులు నిలిచిపోయాయని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ ఆరోపించారు. పనులు వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ మేడిపల్లి, భీమారం, చందుర్తి మండలాల నాయకులతో కలిసి మోత్కురావుపేటలో వేసిన శిలాఫలకం నుంచి చందుర్తి వరకు మంగళవారం బైక్ ర్యాలీ చేపట్టారు. అనంతరం తహసీల్దార్ ఎండీ.మజీద్‌కు వినతిపత్రం అందజేశారు. 2017లో రూ.19.70 కోట్లతో ప్రారంభించిన రోడ్డు పనులు అటవీ శాఖ అనుమతులు లేక నిలిచిపోయాయని తెలిపారు. ఎమ్మెల్యే స్థానికంగా లేకపోవడమే దీనికి కారణమని ఆరోపించారు. చందుర్తి, వేములవాడ, రుద్రంగి మండలాల్లోని 55 వేల ఎకరాలకు సాగునీరందించామని చెప్పుకుంటున్నారని, వాస్తవంలో 20 వేల ఎకరాలకు కూడా ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. ఎమ్మెల్యే నిర్లక్ష్యం మూలంగా ఈ ప్రాంత ప్రజలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు నాగం కుమార్, చందుర్తి, భీమారం మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చింతపంటి రామస్వామి, నరేశ్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు, నాయకులు గొట్టె ప్రభాకర్, మ్యాకల గణేశ్, పులి సత్తయ్య, వేల్పుల దేవస్వామి, బొజ్జ మల్లేశం, ధర్మపురి శ్రీనివాస్, రమేశ్ తదితరులున్నారు.

కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్న కేంద్రం

● సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

ఇల్లంతకుంట(మానకొండూర్): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు ఆరోపించారు. ఈ నెల 21న గాలిపల్లిలో ప్రారంభం కానున్న సీపీఐ ప్రజాచైతన్య యాత్ర పోస్టర్‌ను సోమవారం ఇల్లంతకుంటలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. ఇంటింటికీ సీపీఐని తీసుకెళ్లాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. తొమ్మిదేళ్ల పాలనలో బీజేపీ ఏనాడూ ప్రజల సంక్షేమం కోసం పని చేయలేదన్నారు. దేశ సంపదను అంబానీ, అదానీలకు దోచిపెడుతోందని మండిపడ్డారు. అదానీ ఆస్తి పదేళ్ల క్రితం రూ.50 వేల కోట్లు కాగా ఇప్పుడు రూ.13 లక్షల కోట్లకు పెరిగిందని తెలిపారు. ఇందులో ప్రధాని మోదీ, ఆయన అనుచరుల పాత్ర లేదని బీజేపీ నాయకులు చెప్పగలరా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు మల్లేశం, భూమిరెడ్డి, స్వామి, శంకర్, మల్లేశం, ఆనంద్, వంశీ, ప్రకాశ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సబ్బండవర్గాల అభివృద్ధే సీఎం లక్ష్యం

● సెస్ చైర్మన్ చిక్కాల రామారావు


రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్న రామారావు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): రాష్ట్రంలో సబ్బండవర్గాల అభివృద్ధే సీఎం కేసీఆర్ లక్ష్యమని సెస్ చైర్మన్ చిక్కాల రామారావు అన్నారు. మంగళవారం తంగళ్లపల్లి మండల కేంద్రంలో మార్కండేయ దేవాలయ ఫంక్షన్‌హాలులో ప్రభుత్వం తరఫున ఎంపీపీ పడిగెల మానస, సర్పంచ్ అంకారపు అనితలతో కలిసి ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో కులమతాల తారతమ్యం లేకుండా అన్ని వర్గాలవారు అభివృద్ధి చెందేలా, సంతోషంగా పండుగలు జరుపుకునేలా పాలన సాగుతోందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కోడి అంతయ్య, ఉప సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు పెద్దూరి తిరుపతి, వైస్ ఎంపీపీ జంగిటి అంజయ్య, సింగిల్‌విండో చైర్మన్ బండి దేవదాస్, వైస్ చైర్మన్ రమణా రెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, బండి జగన్, పద్మనగర్ సర్పంచ్ ముదారి పోచయ్య, మహిళా అధ్యక్షురాలు మోర నిర్మల, మదీనా మజీద్ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ హమీద్, మైనారిటీ సెల్ అధ్యక్షురాలు ఫహేదా బేగం, నాయకులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి సాంకేతికత జోడించాలి


మాట్లాడుతున్న వికాస్‌రావు

వేములవాడరూరల్: వ్యవసాయానికి సాంకేతికత జోడించాలని ప్రతిమ ఫౌండేషన్ నిర్వాహకుడు డాక్టర్ చెన్నమనేని వికాస్‌రావు అన్నారు. వేములవాడ రూరల్ మండలంలోని జయవరం గ్రామంలో మంగళవారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శుద్ధజల కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శుద్ధజలం తాగడం వల్ల అనేక రోగాల నుంచి రక్షణ పొందవచ్చని చెప్పారు. మహిళలు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే గ్రామస్తులందరూ ఐక్యంగా ఉండాలని, రైతు ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వ్యవసాయానికి సాంకేతిక జోడించి, పొలం నుంచి వినియోగదారుని వరకు దళారి వ్యవస్థ లేకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. నిరుద్యోగ యువత కోసం గ్రామాల్లో స్కిల్ ఇండియాను కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బండ మల్లేశం, వైస్ ఎంపీపీ జక్కుల కవిత, సర్పంచు తూం భాగ్యమ్మ, ఉపసర్పంచు సార మహేశ్, కేడీసీసీబీ వైస్ ప్రెసిడెంట్ లక్ష్మీకాంతారావు, మాజీ సర్పంచులు, గ్రామస్తులు పాల్గొన్నారు.